

అమ్మవారికి పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ నాయకుడు మామిడి నర్సింగరావు



బోనాలను అమ్మవారికి సమర్పించేందుకు కుటుంబ సభ్యులతో వెళ్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి

# ఫిలింనగర్‌లో ఘనంగా బోనాలు

**బంజారాహిల్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** ఫిలింనగర్‌లో ఆషాఢమాస బోనాలు మంగళవారం ఘనంగా జరిగాయి. డప్పుల చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలతో బస్తీల్లో సందడి నెలకొంది. దుర్గాభవానీనగర్ మారమ్మ-ఎల్లమ్మ ఆలయంలో బోనాల సందర్భంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఫిలింనగర్‌లోని గౌతమ్‌నగర్, ఛత్రపతి శివాజీనగర్, దీనదయాల్‌నగర్, దుర్గాభవానీనగర్‌లకు చెందిన వందలాది మంది మహిళలు సామూహికంగా అమ్మవార్లకు బోనాలను సమర్పించారు. పలు ఆలయాల వద్ద అన్నదానం చేశారు. ఈ వేడుకల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మామిడి నర్సింగరావు, బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగేష్, రాజు, ఎల్లయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### శ్రీ నల్లపోచమ్మ ఆలయంలో పూజలు

**బేగంపేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** బేగంపేట డివిజన్ మాతాజీనగర్‌లోని శ్రీ నల్లపోచమ్మ ఆలయాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షులు బండి రమేష్ మంగళవారం సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు నరేష్ రమేష్‌తోపాటు బేగంపేట సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సుదాంను సన్మానించారు.



నల్లపోచమ్మ ఆలయంలో పూజలు చేసిన బండి రమేష్, విశాల్ సుదాం

### ఘనంగా ఘటాల ఊరేగింపు

**యూసుఫ్‌గూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** బీఆర్ఎస్ నాయకులు రాహుల్ పటేల్, సుదర్శన్‌రావు ఆధ్వర్యంలో వెంకటగిరిలో మంగళవారం జరిగిన బోనాల ఉత్సవాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు రావుల శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన ఘటాల ఊరేగింపులో కార్పొరేటర్ దేదీప్యరావు, దినేష్ చౌదరి, సుదర్శన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



వెంకటగిరిలో జరిగిన ఘటాల ఊరేగింపులో కార్పొరేటర్ దేదీప్యరావు, బీఆర్ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి, రాహుల్ పటేల్

## ఉప ఎన్నికలో విజయమే లక్ష్యం : కేటీఆర్

**బంజారాహిల్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా ప్రతీ ఒక్కరు కష్టపడి పనిచేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సోదరుడు మాగంటి వజ్రనాథ్ మంగళవారం మర్యాద పూర్వకంగా కేటీఆర్‌ను కలిశారు. అనంతరం నియోజకవర్గంలో పార్టీ పరిస్థితుల పై చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గోపీనాథ్ ప్రజలకు ప్రతీ నిమిషం అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించేందుకు ఉప ఎన్నికలో విజయం సాధించాలన్నారు. కార్యక్రమంలో మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పాల్గొన్నారు.



కేటీఆర్‌ను కలిసిన మాగంటి వజ్రనాథ్





రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ సభ్యుడిగా నియమితులైన టీపీసీసీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్ పెట్టెం నవీన్‌ను అభినందిస్తున్న సోమాజిగూడ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎన్.నరేష్, కుమార్, దినేష్, రామకృష్ణ, వినయ్

● బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి



ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలోని శ్రీ నల్ల పోచమ్మ ఆలయంలో బోనాల జాతరకు విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి.నవీన్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్, ఎస్టీ సెల్ నాయకుడు రమేష్ నాయక్, నాయకులు హరినాయక్, ఆస్పత్రి సిబ్బంది మహేందర్, నవీన్, శ్రీనివాస్ తదితరులు

● ఎర్రగడ్డ, ఆంధ్రజ్యోతి



యాదవుల నిర్వహణలో ఉన్న గాలిపోచమ్మ, కట్టమైసమ్మ ఆలయాల బోనాల ఉత్సవాల్లో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్



బోనాల ఊరేగింపులో కళాకారులు

# ఆలయాల అభివృద్ధికి కృషి : దానం

**ఖైరతాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** ఒగ్గు కళాకారుల ప్రదర్శనలు, కోలాట వైభవం, పోతరాజుల వీరంగాలు, నెత్తిన బోనాలతో ఒళ్లు గగుర్పొడిచే నృత్యాలు.. వెరసి ఖైరతాబాద్ యాదవ సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఖైరతాబాద్ యాదవ సంఘం కార్యాలయం నుంచి ఐమాక్స్ ఎదురుగా ఉన్న లేక్‌వ్యూ పార్కులోని గాలిపోచమ్మ, కట్ట మైసమ్మ ఆలయాల వరకు భారీ ఊరేగింపు జరిగింది. స్థానిక మహిళలు కుటుంబాల సమేతంగా పాల్గొన్నారు. అనంతరం సంఘం అధ్యక్షుడు కుమార్ యాదవ్ అధ్యక్షతన ఖైరతాబాద్ యాదవుల కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ఇందులో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, ఆలయాల కమిటీ చైర్మన్, మాజీ కార్పొరేటర్ జి.కృష్ణయాదవ్, మాజీ కార్పొరేటర్ మహేష్‌యాదవ్, ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, యాదవ కుల పెద్దలు యాదయ్య యాదవ్, ఎం.మల్లేష్ యాదవ్, పాండు యాదవ్, ఒగ్గు కృష్ణ యాదవ్, లక్ష్మణ్ యాదవ్, భవానీకృష్ణ యాదవ్, మారయ్య యాదవ్, ఓబుల్ యాదవ్, యాదవ సంఘం ప్రతినిధులు మల్లికార్జున్ యాదవ్, ఎ.రాజు యాదవ్, గంగాధర్ యాదవ్, రాము యాదవ్, మహేష్ యాదవ్, బాలు యాదవ్, రాజేందర్ యాదవ్, ఫకీరయ్య యాదవ్ పాల్గొన్నారు.

భారీ ఊరేగింపుతో ఖైరతాబాద్‌లో సందడి వాతావరణం కనిపించింది. కాగా, 50 సంవత్సరాల పురాతన ఆలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రితో చర్చిస్తానని ఎమ్మెల్యే దానం నాగేందర్ హామీ ఇవ్వగా, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు. ఖైరతాబాద్ మహంకాళి ఆలయం తరఫున యాదవుల గాలిపోచమ్మ, కట్ట మైసమ్మ ఆలయాల అభివృద్ధి కోసం రూ.11 వేల విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు.



నిర్మాణ సామగ్రిని రోడ్డు మీద వేసిన ఓ ప్లాట్ యజమాని

## రోడ్డు ఆక్రమించి ప్రహరీ నిర్మాణం

● జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే కాలనీ సంక్షేమ సమితి

**బంజారాహిల్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** ఓ ప్లాట్ యజమాని రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తుండడంతో వెంటనే చర్యలు తీసుకోవాలని కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధులు జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.12 ఎమ్మెల్యే కాలనీలోని ప్లాట్ నెంబర్.224/ఎ యజమాని ఇటీవల నిర్మాణాలు మొదలు పెట్టారు. కాగా, రోడ్డును ఆక్రమించి ప్రహరీ నిర్మిస్తున్నాడని కాలనీ సంక్షేమ సమితి అయిన శ్రీ వెంకటేశ్వర కో-ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు టి.నారాయణరెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిర్మాణదారుడు సామగ్రిని రోడ్డు మీద వేసి రాకపోకలకు ఆటంకాలు కలిగిస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

## బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడికి స్వాగతం

**పంజాగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** అమెరికాలో జరిగిన నాట్స్ 8వ తెలుగు సంబరాలకు భారత కో-ఆర్డినేటర్‌గా వెళ్లి విజయవంతంగా ముగించుకుని మాజీ కార్పొరేటర్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కిలారి మనోహర్ మంగళవారం తెల్లవారుజామున నగరానికి చేరుకున్నారు. ఈయనకు శంషాబాద్ విమానాశ్రయంలో బీజేపీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ నాయకులు, కుటుంబసభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆర్ఎస్ఎస్ సంఘటన తెలంగాణ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ విభాగం కార్యదర్శి బి.రూప, తదితరులు స్వాగతం పలికారు. నాట్స్ సభలను విజయవంతం చేసినందుకు ఆయనను అభినందించారు.



కిలారి మనోహర్‌కు స్వాగతం పలుకుతున్న రూప



సైక్లింగ్ పోటీల్లో పాల్గొన్న ఔత్సాహికులు

## ఉత్సాహంగా రాడిసన్ సైక్లింగ్ పోటీలు

**హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి):** ఫిట్‌నెస్‌పై అవగాహన కల్పించేందుకు రాడిసన్ బ్లూ ప్లాజా సంస్థ 'సైకిల్ ఫర్ ఎ కాజ్' కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో 120 మందికి పైగా ఔత్సాహికులు పాల్గొన్నారు. రైడ్ ఫర్ హోప్(3 కి.మీ), రైడ్ ఫర్ చేంజ్ (6 కి.మీ), రైడ్ ఫర్ ఇంపాక్ట్ (50 కి.మీ) విభాగాల్లో పోటీ నిర్వహించారు. రాడిసన్ సంస్థ జీఎం సందీప్ మాట్లాడుతూ ఆరోగ్య భద్రతపై, ఫిట్‌నెస్ ప్రాముఖ్యత గురించి ప్రజలను జాగృతం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించామని చెప్పారు.

## హోటల్ వ్యాపారికి బెదిరింపు

**యూసుఫ్‌గూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** హోటల్ యజమానిని చంపుతానని ఓ వ్యక్తి బెదిరించాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన లలిత్ కుమార్ వెంగళరావునగర్‌లో హోటల్ నిర్వహిస్తున్నాడు. ఈనెల 20న మద్యం మత్తులో గుర్తు తెలియని వ్యక్తి హోటల్‌కు వచ్చాడు. హోటల్‌లోని కుర్చీలు, బల్లాలను పగలగొడుతూ బీభత్సం సృష్టించాడు. కస్టమర్లను, పనిచేసే సిబ్బందిని బూతులు తిడుతూ భయభ్రాంతులకు గురి చేశాడు. రాజకీయ పలుకుబడి ఉందని, సిటీలో రౌడీ షీటర్లు తెలుసని, ఓనర్‌ని చంపేస్తానని బెదిరించాడు. ఓనర్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

## సెల్‌ఫోన్ మాయం

**యూసుఫ్‌గూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** అపార్ట్‌మెంట్‌లో చార్జింగ్ పెట్టిన సెల్‌ఫోన్ మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కె.ఏసుబాబు ఎల్లారెడ్డిగూడలోని దగ్గర బంధువు గోవిందరాజు వద్ద ఉంటున్నాడు. ఆదివారం అపార్ట్‌మెంట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్ లో సెల్‌ఫోన్ చార్జింగ్ పెట్టాడు. రెండు గంటల తర్వాత వెళ్లి చూడగా సెల్‌ఫోన్ మాయమైంది. దీంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## కస్టడీ నుంచి పారిపోయేందుకు యత్నం

**యూసుఫ్‌గూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** పాత కేసులో అరెస్టు అయి స్టేషన్‌లో ఉన్న పాత నేరస్థుడు పారిపోయేందుకు ప్రయత్నించాడు. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం షాహీన్ నగర్‌కు చెందిన షేక్ ఇబ్రహీం బిన్ హసన్‌ను పోలీసులు పాత కేసులో అరెస్టు చేసి స్టేషన్‌కు తీసుకొచ్చారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో అరుస్తూ, బూతులు తిడుతూ నానా హంగామ సృష్టించి పారిపోయేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు నివారించారు. తిరిగి ఆత్మహత్య చేసుకుంటానని పోలీసులను బెదిరించాడు.

## ద్విచక్ర వాహనం మాయం

**యూసుఫ్‌గూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** ఇంటి ముందు నిలిపిన ద్విచక్ర వాహనం మాయమైన సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రహ్మత్‌నగర్‌కు చెందిన కె.నీలాచలం సోమవారం రాత్రి ఇంటి ముందు ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. ఉదయం చూడగా వాహనం లేదు. చుట్టుపక్కల వెతికినా దొరకకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# ఇద్దరి అవయవ దానం.. మరికొందరికి ప్రాణదానం

**నిమ్స్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అవయవదానం చేశారు. అంబర్‌పేట నెహ్రూనగర్‌కు చెందిన కలకుంట్ల వేణుగోపాల్(55) సీజీహెచ్ఎస్ ఉద్యోగి. ఈనెల 19న ఇంట్లో కుప్పకూలిపోయాడు. స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈనెల 21న బ్రెయిన్ డెడ్ అయినట్టు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. ఈయన భార్య ఉషశ్రీకి అవయవదానంపై జీవన్‌దాన్ వైద్యులు అవగాహన కల్పించారు. అందుకు అంగీకరించడంతో వేణుగోపాల్ శరీరం నుంచి రెండు మూత్ర పిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు సేకరించారు.



వేణుగోపాల్



బండి కిరణ్

అలాగే, జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లికి చెందిన బండి కిరణ్(34) వెటర్నరీ డాక్టర్. రెండు సంవత్సరాలుగా హై బీపీతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈనెల 17న అకస్మాతుగా రక్తపోటు పెరగడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. ఉప్పల్‌లోని ఇంట్లో కుప్పకూలిపోయాడు. కుటుంబ సభ్యులు ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు. ఈనెల 21న బ్రెయిన్ డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. కిరణ్ తండ్రి బండి సుదర్శన్ అనుమతితో శరీరం నుంచి రెండు మూత్ర పిండాలు, కాలేయం, ఊపిరితిత్తిని సేకరించి మరి కొందరికి అమర్చినట్లు జీవన్‌దాన్ నోడల్ అధికారి శ్రీ భూషణ్ రాజు తెలిపారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత

**ఎర్రగడ్డ, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తమ వంతు సహకారం అందిస్తే ఉన్నతస్థాయికి ఎదుగుతారని గూడూరి ఫౌండేషన్ చైర్మన్ గూడూరి చెన్నారెడ్డి అన్నారు. మంగళవారం బబ్బుగూడలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పలకలు, పెన్సిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు చేయూతనందించేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో గూడూరి ఫౌండేషన్ కార్యదర్శి గూడూరి శ్రీధర్‌రెడ్డి, స్నేహిత ట్రస్ట్ చైర్‌పర్సన్ చింతపల్లి శోభారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉప ప్రధానోపాధ్యాయురాలు వకుళాదేవి, ఉపాధ్యాయులు రాము, విశ్వంతమ్మ, నవ్య, వెంకటేశం, సుమతి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులతో శ్రీధర్‌రెడ్డి, శోభారెడ్డి

## ప్రత్యేక అలంకారంలో బల్కంపేట ఎల్లమ్మ

**అమీర్‌పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** ఆషాఢమాసం పురస్కరించుకుని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారు రోజుకో తీరుగా అలంకృతురాలై భక్తులకు దర్శనమిస్తున్నారు. మంగళవారం అమ్మవారి మూలవిరాట్, గర్భగుడిలో సీతాఫలాలు, స్వీట్లతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఎల్లమ్మను దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి నానా అవస్థలు పడ్డారు.



స్వీట్లు, సీతాఫలాలతో అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ

## శిశువిహార్ ఆయాలకు వేతన బకాయిలు చెల్లించాలి

**పంజాగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** యూసుఫ్‌గూడ ప్రధాన రహదారి రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఆవరణలోని శిశువిహార్‌లో పనిచేస్తున్న ఆయాలకు ఐదు నెలల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ డిమాండ్ చేశారు. శిశువిహార్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ నెల 7వ తేదీలోపు జీతాలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ అమలు చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్ రెండు లక్షలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.వెంకటేష్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా రాపర్తి అశోక్, కార్యదర్శిగా సుశీల, ఉపాధ్యక్షులుగా మంగ, ఆదిలక్ష్మి, సహాయ కార్యదర్శులుగా కవిత, రాజేశ్వరి, కోశాధికారిగా శ్యామలీల, కార్యనిర్వాహక కార్యదర్శిగా జయశ్రీ, కమిటీ సభ్యులుగా పద్మ, నర్సమ్మ, సునీత సక్కుబాయి, హేమలత, ఆర్.లక్ష్మి ఎన్నికయ్యారు. సమావేశంలో సీఐటీయూ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు జె.కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.ఈశ్వర్‌రావు, ఎం.వెంకటేష్, అశోక్, ఆయాలు పాల్గొన్నారు.



డీఎంసీకి వినతిపత్రం ఇస్తున్న కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

## వారాంతపు సంతను తొలగించాలి

**ఎర్రగడ్డ, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** రాజీవ్ నగర్‌లో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న వారాంతపు సంత వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, సంతను తక్షణమే తొలగించాలని కోరుతూ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డికి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కాలనీలోని రోడ్డు నెంబర్.3, 4లో నిర్వహిస్తున్న సంత వల్ల కాలనీవాసులు ప్రశాంత జీవనాన్ని కోల్పోతున్నారన్నారు. సంత ముగిసిన మరుసటి రోజు రోడ్లన్నీ అపరిశుభ్రంగా తయారవుతున్నాయని, దీనివల్ల కాలనీవాసులకు ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. రోడ్లు, పాదచారులు ఉపయోగించే ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతుండడం వల్ల వాహనాల రాకపోకలకు అసౌకర్యం కలుగుతోందని ఆరోపించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాలనీ సంక్షేమ సంఘం సంయుక్త కార్యదర్శి వివేకానంద, సభ్యుడు పట్నాయక్ తదితరులు ఉన్నారు.

## దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

**గచ్చిబౌలి, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో మంగళవారం దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ప్రాజెక్ట్ అధికారి నాగమల్లేశ్వరి దివ్యాంగులకు చేతి కర్రలు, చైర్స్, ట్రైసైకిళ్లు, ఇయరింగ్ మిషన్లు, హ్యాండ్‌స్టిక్స్ వంటి పరికరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్కిల్ సీఈవో శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



హాస్య నాటకంలో ఓ సన్నివేశం

## కడుపుబ్బా నవ్వించిన వర్క్ ఫ్రం హోమ్ నాటకం

**ఖైరతాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** తెలుగు నాటక సమితి, ఏజీ ఆఫీస్ ఆధ్వర్యంలో మంగళవారం ఏజీ ఆఫీస్‌లో ప్రదర్శించిన హాస్యనాటకం సందర్శకులను కడుపుబ్బా నవ్వించింది. చిలకలూరిపేటకు చెందిన కళాకారులు వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట ఈ నాటకాన్ని ప్రదర్శించారు. నాటక ఇతివృత్తంలోకి వెళ్తే కొత్తగా పెళ్లి చేసుకున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల జంటలో భర్త వంటల్లో నిష్ణాతుడు కాగా, భార్యకు కనీసం కాఫీ కలపడం రాదు. సుధీర్ వంట గురించి బంధువులకు, పుట్టింటివాళ్లకు చెప్పగా తరచూ వారు ఇంటికి వస్తుండడంతో సతమతమయ్యే భర్త కథ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్వించింది. అనంతరం తెలుగు నాటక సమితి అధ్యక్షురాలు బీవీ వరలక్ష్మి పదవీ విరమణ సందర్భంగా ఆమెకు ఆత్మీయ సత్కారం చేశారు. కార్యక్రమంలో ఏజీ ఆఫీస్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ బీఎమ్ రెడ్డి, ప్రతినిధులు నరేష్, రూప, పెరుమాళ్లు, నడిమింటి జగ్గారావు, పద్మనాథన్, అచ్యుతరావు, రాణి, సుధారాణి పాల్గొన్నారు.



దండుమారమ్మ ఆలయాన్ని సందర్శించిన జంపన తదితరులు

## దండుమారమ్మ బోనాలకు ఏర్పాట్లు చేయాలి

**సికింద్రాబాద్, జూలై 22(ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్ కంటోన్మెంట్‌తో పాటు జంటనగరాల్లో ప్రసిద్ధి చెందిన బాలంరాయి దండుమారమ్మ బోనాల జాతరను వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ అధికారులను కోరారు. మంగళవారం ఆయన ఆలయాన్ని సందర్శించి, అమ్మవారికి పూజలు జరిపి, మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు తన వంతుగా విరాళం అందచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బోనాల జాతరలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని కోరారు. బి.శ్రీనివాస్, కృష్ణ, దర్గారవి, సాయికిరణ్, వినోద, భాగ్యలక్ష్మి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

## కేరళ మాజీ సీఎంకు నేతల నివాళులు

**అడ్డగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :** అనారోగ్యంతో మరణించిన కేరళ మాజీ సీఎం అచ్యుతానందన్‌కు సీపీఎం సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి ఆర్.మల్లేష్ మంగళవారం అడ్డగుట్టలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరుసగా మూడుసార్లు కేరళ ప్రతిపక్ష నేతగా ఎన్నియ్యారని, 2006 నుంచి 2011 వరకు క్యాబినెట్ హోదాలో పరిపాలన సంస్కరణల కమిషన్ చైర్మన్‌గా పని చేశారన్నారు. కార్యక్రమంలో జోన్ కమిటీ నాయకులు ఎం.అజయ్‌బాబు, గోపాల్, లలిత పార్టీ సభ్యులు సామెల్, కోటేశ్వర్‌రావు, శ్యామల, నూర్జాన్, శ్యామల, అండాలు, ప్రతిమ్మలు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**అడ్డగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :** దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కన్వీనర్ పులి కల్పన ఆధ్వర్యంలో మంగళవారం అడ్డగుట్టలోని మొండి బండనగర్ బస్తీలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో కిడ్నీ, గుండె, లివర్, డయాబెటిస్, బీపీ వివిధ రుగ్మతలతో బాధపడుతున్న దాదాపు 50 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు.



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు

### క్రైమ్ సమాచారం

## వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

**బౌద్ధనగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి):** ఇంటి నుంచి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నామాలగుండులో నివసించే గుజ్జరి రాజేశ్వరి(47) మూడు సంవత్సరాల క్రితం తండ్రి మృతి చెందటంతో మానసికంగా మనస్తాపానికి గురైంది. కుటుంబ సభ్యులు ఆమెకు వైద్యం చేయిస్తున్నారు. వారం రోజుల క్రితం రాజేశ్వరి శ్రీనివాస్‌నగర్‌లోని తల్లి దగ్గరకు వెళ్లింది. ఆమెను తీసుకురావటానికి కుమార్తెలు వెళ్లగా వారిని దూషించటంతో రాజేశ్వరి తల్లి రాజేశ్వరిని కొట్టింది. దీంతో మనస్థాపానికి గురైన రాజేశ్వరి 19న ఉదయం ఆరు గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. తన భార్య కనిపించటం లేదని భర్త జి.శ్రీనివాస్ సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రాజేశ్వరి (ఫైల్)

## గాంధీ ఆస్పత్రి నుంచి..

గాంధీ ఆస్పత్రి నుంచి రోగి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కవాడిగూడ మగ్గుబస్తీకి చెందిన ఎస్.లక్ష్మీనారాయణ(46) భార్య మృతి చెందటంతో మద్యానికి బానిసై, అనారోగ్యం బారిన పడ్డాడు. అతడికి అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుంటాయి. అతడి ఆరోగ్యం క్షీణించటంతో 16న తల్లి ప్రమీల చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రిలో చేర్పించింది. 17న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో అతడు ఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యాడు. అతడి కోసం పలుచోట్ల గాలించిన ఫలితం లేదు. తన కుమారుడు కనిపించటం లేదని తల్లి సోమవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మీనారాయణ (ఫైల్)

## బోనాలు చూసేందుకు వచ్చి.. రైలునుంచి జారిపడి వ్యక్తి మృతి

**సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :** సికింద్రాబాద్‌లో బోనాలు చూసేందుకు నగరానికి వచ్చిన ఓ యువకుడు తిరిగి ఊరు వెళుతూ ప్రమాదవశాత్తు రైలునుంచి జారి కాలువలో పడి మృతి చెందిన ఘటన లాలాగూడ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజు తెలిపిన వివరాల ప్రకారం గుడివాడకు చెందిన పామర్తి వీరబాబు(23) ఆటో డ్రైవర్. ఆదివారం గుడివాడ నుంచి సికింద్రాబాద్‌కు చేరుకుని బోనాలు చూసి అదేరోజు రాత్రి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మచిలీపట్నం రైలు ఎక్కాడు. ప్రయాణం చేస్తున్న సమయంలో లాలాగూడ - మౌలాలి రైల్వేస్టేషన్ మార్గమధ్యలో కదలుతున్న రైలునుంచి ప్రమాదవశాత్తు జారిపడి పట్టాల పక్కన ఉన్న మురికి కాలువలో పడి చనిపోయాడు. మంగళవారం స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి జేబులో దొరికిన అడ్రస్ ప్రకారం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



వీరబాబు(ఫైల్

# అడ్డగుట్టలో అధ్వానంగా తాగునీటి ట్యాంకులు

**పట్టించుకోని అధికారులు**



అడ్డగుట్ట సీపీఐ కార్యాలయం పక్కన శిథిలావస్థలో ట్యాంక్



అడ్డగుట్ట మజీద్ పక్కన అధ్వాన స్థితిలో సింటెక్స్ ట్యాంక్



అడ్డగుట్ట 10-4-920 ఎదురుగా అధ్వానంగా సింటెక్స్ ట్యాంక్

**అడ్డగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :** సికింద్రాబాద్ అడ్డగుట్ట డివిజన్‌లో దాదాపు రెండేళ్ల నుంచి తాగునీటి ట్యాంకులు అధ్వానస్థితిలో ఉన్నా మరమ్మతులు చేయించేందుకు అధికారులు ముందుకు రాలేదు. అలాగే సింటెక్స్ ట్యాంకుకు అమర్చిన విద్యుత్ మోటార్ పనిచేయడం లేదు. దీంతో ప్రజల ఉపయోగార్థం ఏర్పాటు చేసిన సింటెక్స్ ట్యాంకులు పనికిరాకుండాపోయాయి. అనేకసార్లు స్థానిక కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. రోజు విడిచి రోజు సరఫరా అవుతున్న మంజీరా నీరు అడ్డగుట్టలో సరిపోకపోవడంతో స్థానికులు ఈ సింటెక్స్ నీళ్లతోనే సరిపెట్టుకుంటున్నారు. రెండేళ్లు అయినా వీటికి మరమ్మతులు చేయకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడ్డగుట్ట కమ్యూనిటీహాలు వెనుకవైపున ఉన్న మజీద్ పక్కన, అడ్డగుట్ట సీపీఐ కార్యాలయం ఎదురుగా, అడ్డగుట్ట కమ్యూనిటీహాలు నుంచి లోహియనగర్ వైపు వెళ్లే దారిలో సింటెక్స్ ట్యాంకులు పనిచేయడం లేదు. అదేవిధంగా అడ్డగుట్ట బస్టాపు ఎదురుగా, తుకారాంగేట్ కేజీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న గల్లీలోతో పాటు ఆజాద్‌చంద్రశేఖర్‌నగర్, అడ్డగుట్ట డి-సెక్షన్, తుకారాంగేట్ చౌరస్తా, వెంకటేనగర్, ఇందిరాలక్ష్మీనగర్, కేజీ ఆస్పత్రి ఎదురుగా ఇలా దాదాపు ఇరవై ప్రదేశాల్లో ట్యాంకులు పనిచేయడం లేదు. ఇప్పటికైనా సింటెక్స్ ట్యాంకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. కమ్యూనిటీహాలు నుంచి (10-4-920) ఇంటి ఎదురుగా ఉన్న సింటెక్స్‌కు సంబంధించిన ఇనుప పైప్‌లైన్ పగిలిపోవడంతోనే సింటెక్స్ పనిచేయడం లేదని స్థానికులు చెబుతున్నారు.

### ట్యాంకులకు మరమ్మతులు చేయాలి



బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో స్థానిక కార్పొరేటర్ ఆధ్వర్యంలో వేసిన సింటెక్స్ ట్యాంకులు చాలాచోట్ల అధ్వానస్థితికి చేరాయి. ఇప్పటివరకు మరమ్మతులు చేయించడానికి అధికారులు ముందుకు రావడం లేదు. ఈ సింటెక్స్ ట్యాంకులు బాగు చేయాల్సిన అవసరం ఉంది.

**- రేవతి, అడ్డగుట్ట**

### పనిచేయని చేతి పంపులు



పవర్ బోర్లే సింటెక్స్ ట్యాంకులే కాదు, చేతి పంపులు కూడా పనిచేయడంలేదు. శాస్త్రినగర్ బస్తీలో ఉన్న చేతిపంపు రెండేళ్ల క్రితం అధ్వానస్థితికి చేరింది. చేతి పంపులకు మరమ్మతు చేయాలని జలమండలి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కనీసం నీళ్లు రానీ రోజు చేతి పంపు బస్తీవాసులకు ఉపయోగం వస్తుంది.

**- శోభ, శాస్త్రినగర్**



హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ నుంచి స్వీయ జీవితచరిత్ర 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాలను అందుకుంటున్న బీజేపీ నాయకులు

## ప్రజల కథే నా ఆత్మకథ పుస్తకాలు అందజేత

**బౌద్ధనగర్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తాను రచించిన స్వీయజీవిత చరిత్ర ప్రజల కథే నా ఆత్మకథే పుస్తకాలను సికింద్రాబాద్ నియోజకవర్గ బీజేపీ నాయకులకు అందజేశారు. మంగళవారం బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు రాంనగర్‌లో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. దత్తాత్రేయ జీవితం మనందరికీ ఆదర్శనీయమని, అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించిన ఘనత దత్తాత్రేయదని సారంగపాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంవీవీ సత్యనారాయణ, మేకల కీర్తి, కన్నాభిరామ్, కొమరయ్య, అంబాల రాజేశ్వరరావు, హన్మంత్‌ముదిరాజ్, నాగరాణి పాల్గొన్నారు.



మురుగు సమస్య పరిష్కరించాలని కోరుతూ స్థానికులతో కలిసి ధర్నా చేస్తున్న కార్పొరేటర్ కొంతం దీపిక

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి

- కార్పొరేటర్ కొంతం దీపిక

**మారేడుపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :** మారేడుపల్లి టీచర్స్ కాలనీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ మంగళవారం మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక స్థానిక అంబేడ్కర్‌నగర్ బస్తీవాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలమండలి అధికారులు డ్రైనేజీ మురుగు ఏరులై పారుతున్న సమయాల్లో తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయమై ఎన్నో సార్లు జలమండలి అధికారుల దృష్టికి తీసుకువచ్చినప్పటికీ పరిష్కార పనులు ప్రారంభం కావడం లేదని అన్నారు.

## నాలాల అభివృద్ధి పనులపై విస్తృత చర్చ

**సికింద్రాబాద్, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** నాలాల అభివృద్ధి పనులు చేసేటప్పుడు ఆయా కాలనీల, బస్తీల ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేసి, సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని కంటోన్మెంట్ అధికారులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ సూచించారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో సమకూరిన రూ.303 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులపై కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్‌తో స్థానిక శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ నిధులతో కంటోన్మెంట్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులపై ఆయనతో విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా కూకట్‌పల్లి నుంచి వచ్చే హస్మత్‌పేట్ నాలా, పికెట్ నాలాల అభివృద్ధి, భూగర్భ డ్రైనేజీ నిర్మాణం తదితర అంశాలపై దృష్టి సారించాలని ఆయన సూచించారు. దీనికి సీఈఓ మధుకర్ నాయక్ సానుకూలంగా స్పందించారు. వీటిపైనే ప్రధానంగా దృష్టి సారిస్తామని, బోర్డు పరిధిలో ఎక్కడెక్కడ పనులు అవసరమో ఎమ్మెల్యేతో చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ సమావేశంలో పాల్గొన్నారు.



మధుకర్ నాయక్‌తో చర్చిస్తున్న శ్రీగణేష్

## ప్రత్యేక అలంకారంలో బల్కంపేట ఎల్లమ్మ

**అమీర్‌పేట, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** ఆషాఢమాసం పురస్కరించుకుని బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారు రోజుకో తీరుగా అలంకృతురాలై భక్తులకు దర్శనమిస్తున్నారు. మంగళవారం అమ్మవారి మూల విరాట్, గర్భగుడిలో సీతాఫలాలు, స్వీట్లతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఎల్లమ్మను దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు తరలిరావడంతో ఆలయం కిటకిటలాడింది. భక్తులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడి నానా అవస్థలు పడ్డారు.



స్వీట్లు, సీతాఫలాలతో అలంకృతురాలైన బల్కంపేట ఎల్లమ్మ



వట్టిపల్లి కోటేశ్వరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, స్కూల్ నిర్వాహకులు

## విద్యా ప్రదాత వట్టిపల్లి కోటేశ్వరరెడ్డికి నివాళి

**బౌద్ధనగర్, జూలై 22(ఆంధ్రజ్యోతి):** ఎంతోమంది పేద విద్యార్థులకు ఉచిత విద్యనందించి వారిని ఉన్నతస్థానాలకు తీసుకువెళ్లిన విద్యాప్రదాత, అమరావతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు వట్టిపల్లి కోటేశ్వరరెడ్డి 69వ జయంతి వేడుకలు మంగళవారం జరిగాయి. సీతాఫల్‌మండి చౌరస్తాలోని వట్టిపల్లి కోటేశ్వరరెడ్డి విగ్రహానికి స్కూల్ కరస్పాండెంట్లు కె.ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రసన్నలక్ష్మి, కవితారెడ్డి, వీణారెడ్డి, దశరథ్‌తో పాటు పూర్వ విద్యార్థులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



రోడ్డు భద్రతపై జేబీఎస్ ఆర్టీసీ డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న నార్త్ జోన్ ఏసీపీ శంకర్‌రాజు

## రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

- నార్త్ జోన్ ఏసీపీ శంకర్‌రాజు

**మారేడుపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :** జేబీఎస్‌లో మంగళవారం ఆర్టీసి డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు నివారణ అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుమారు 55మంది డ్రైవర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో జోనల్ ఈడీ ఏ.రాజశేఖర్, రీజినల్ ఆర్ఎం సుచరిత, డిపో మేనేజర్ డి.సుధాకర్‌రావు, జ్ఞానేశ్వర్, ఇన్‌స్పెక్టర్ కాశేశ్వర్, వెంకట ప్రసాద్, హెచ్.జి. అధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## సంగీత, నృత్య కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**చిలకలగూడ, జూలై 22 (ఆంధ్రజ్యోతి):** సికింద్రాబాద్, ఈస్ట్ మారేడుపల్లి శ్రీభక్త రామదాసు ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహావాది సరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక, హిందుస్తానీ గాత్రం, వీణ, వయోలిన్, సితార్, తబలా, మృదంగం, కూచిపూడి, భరత నాట్యం, పేరిణి నృత్యాల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్, డిప్లొమా సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. నిష్ణాతులైన లెక్చరర్లు శిక్షణ ఇవ్వనున్నట్లు, విద్యార్థులు తమ వెంట ఎటువంటి వాద్య పరికరాలు తెచ్చుకోవాల్సిన అవసరం లేదని అన్నారు. సంవత్సరానికి సర్టిఫికెట్ కోర్సు ఫీజు రూ. 1100, డిప్లొమాకు 1500. ఆసక్తి గలవారు కళాశాలలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల సంప్రదించవచ్చునని, వివరాలకు 040-27801788 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

## 24 నుంచి క్రీడా పోటీలు

**మారేడుపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :** కంటోన్మెంట్ ప్రాంతంలోని క్రీడాకారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో 24 నుంచి 26 వరకు మూడు రోజుల పాటు మారేడుపల్లిలోని పద్మశాలి కల్యాణ మండపం గ్రౌండ్, సికింద్రాబాద్ పబ్లిక్ స్కూల్‌లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు రుక్మిణీబాయి స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకుడు లక్ష్మీకాంత్ వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ టేబుల్ టెన్నిస్, కరాటే, చెస్, క్యారంబోర్డ్, సింగిల్స్, డబుల్స్‌తో పాటు వాలీబాల్ పోటీలు ఏడో నుంచి పదో తరగతి చదువుతున్న బాలబాలికలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఆదివారం లోపు పేర్లను నమోదు చేసుకోవాలని, ఇందుకు పద్మశాలి కల్యాణ మండపంలోని కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు. ఈ క్రీడలను తెలంగాణ స్పోర్ట్స్ అసోసియేషన్‌కు సంబంధించిన రెఫరీలు నిర్వహిస్తారని అన్నారు.

## త్వరలో అభివృద్ధి పనులకు మోక్షం

**మారేడుపల్లి, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :** మారేడుపల్లి టీచర్స్ కాలనీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ చర్యలు చేపట్టారని మారేడుపల్లి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సి.సంతోష్ యాదవ్ వెల్లడించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్‌నగర్ బస్తీలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య పరిష్కారానికి ఒక కోటి 15 లక్షలు మంజూరైనట్లు, పనులు ప్రారంభించడానికి టెండర్ ప్రక్రియ జరుగుతుందని, విడుదల చేసిన ప్రక్రియ పత్రాలను ఆయన చూపించారు. అభివృద్ధి పనులకు త్వరలో మోక్షం కలుగుతుందని ఆయన తెలిపారు. కాగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు బద్రీనాథ్ యాదవ్ ఇదే సమస్యపై ఎమ్మెల్యే శ్రీగణేష్, జలమండలి ఉన్నత అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఒక ప్రకటనలో తెలిపారు.



## అమ్మవారికి బోనాలు సమర్పణ

వారాసిగూడ ఉప్పరబస్తీ ఆరుట్ల మైసమ్మ ఆలయంలో మంగళవారం మాజీ కార్పొరేటర్ పి.స్వరూపగౌడ్ ఆషాఢమాస బోనాలను సమర్పించి, ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, బీజేపీ బౌద్ధనగర్ డివిజన్ అధ్యక్షుడు పి.సాయిప్రసాద్‌గౌడ్, నాయకులు అజయ్‌కుమార్, లక్ష్మణ్, సత్యనారాయణ, మధు తదితరులు పాల్గొన్నారు.

**- బౌద్ధనగర్, ఆంధ్రజ్యోతి**



## హుండీ లెక్కింపు

లాల్‌బజార్ మహంకాళి దేవాలయ హుండీ లెక్కింపు మంగళవారం ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. రూ.2,77,331 లక్షల ఆదాయం వచ్చింది. ఆలయ చైర్మన్ మురళి, భక్తవత్సలమ్, మల్లేష్, మధు, రాజేష్, అశోక్, సుధాకర్‌లు పాల్గొన్నారు.

**- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి**



## బోనాల ఉత్సవాలు

బోనాల సందర్భంగా గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజకుమారి ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో గ్యాస్ట్రోలాజి విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రవణ్, ఈస్ట్‌జోన్ ఏసీపీ శశాంక్‌రెడ్డి, చిలకలగూడ సీఐ అనుదీప్‌లతో పాటు గాంధీ వైద్యులు పాల్గొన్నారు.

**- అడ్డగుట్ట, ఆంధ్రజ్యోతి**

## చైన్ స్నాచర్ అరెస్ట్

- ముప్పైకి పైగా నేరాలు
- దోస్తులను విడిపించేందుకు నేరాలు

**సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :** రైళ్లలో చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఓ నిందితుడిని సికింద్రాబాద్ జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. మంగళవారం సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రైల్వే డీఎస్పీ జావీద్, జీఆర్పీ సీఐ సాయి ఈశ్వర్‌గౌడ్, ఆర్పీఎఫ్ సీఐ సరస్వత్‌లు మాట్లాడుతూ కర్ణాటక రాయచూర్ జిల్లా దేవదుర్గా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బలేవాడి గ్రామానికి చెందిన మోతీలాల్ రెడ్డప్ప పవర్(24) కూలి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. డబ్బులు సరిపోకపోవడంతో నేరాల బాట పడ్డాడు. ఉపాధి కోసం పుణెకు వెళ్లి అక్కడ చిన్న చిన్న నేరాలకు పాల్పడగా, ఇతడిపై ముప్పై కేసులు నమోదయ్యాయి. ఇటీవల జైలు నుంచి విడుదలైనా అతడి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో సికింద్రాబాద్‌కు చేరుకున్నాడు. ఓ లాడ్జిలో ఉంటూ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వెళ్లే పల్నాడు, ఎంఎంటీఎస్ రైళ్లలో మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును తెంపుకుని పారిపోయాడు. మంగళవారం అతడు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదస్థితిలో తిరుగుతుండగా గమనించిన సికింద్రాబాద్ ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు ఎస్సై సుబ్బారారెడ్డి, సుఖ్‌దేవ్, హరిలాల్, భవాని శంకర్, వినోద్ కుమార్, ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణలు కలిసి అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో అనేక రైళ్లలో దొంగతనం చేశానని ఒప్పుకున్నాడు. గతంలో నేరాలు చేసి జైలులో ఉన్న స్నేహితులను బయటికి తీసుకొచ్చేందుకు నేరాలు చేశానని ఒప్పుకున్నాడు. కేసు నమోదు చేసుకున్న రైల్వే పోలీసులు నిందితుడి నుంచి రూ.3.50 లక్షల విలువ చేసే 35 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకున్నారు.



చైన్ స్నాచర్‌ను అరెస్ట్ చేసి చూపుతున్న రైల్వే పోలీసులు

## మద్యం ప్రియులకు జైలుశిక్ష

**అడ్డగుట్ట, జూలై 22 (ఆంధ్రజ్యోతి) :** డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో మద్యంప్రియులకు నాంపల్లి కోర్టు జైలుశిక్ష విధించింది. తిరుమలగిరి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు తెలిపిన వివరాల ప్రకారం తిరుమలగిరి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వారంరోజుల నుంచి డ్రంక్ డ్రైవ్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించగా పట్టుబడిన మద్యంప్రియులకు నాంపల్లి కోర్టు జైలు శిక్ష విధించింది. వివరాల్లోకి వెళితే మద్యంమత్తులో బైకులు నడుపుతూ పట్టుబడిన కేసుల్లో బొల్లారంకు చెందిన ప్రవీణ్‌కుమార్‌కు ఒకరోజు జైలుశిక్ష, రూ.2,100జరిమానా, కుత్బుల్లాపూర్‌కు చెందిన జనార్ధన్‌కు రెండు రోజుల జైలుశిక్ష, రూ.2,100 జరిమానా, క్రిమెంట్‌కు రెండురోజుల జైలుశిక్ష, రూ.2,100జరిమానా, నల్లగొండకు చెందిన మహేష్‌కు రెండురోజుల జైలు, రూ.2,100 జరిమానా, కవాడిగూడకు చెందిన దినేష్‌కు 10 రోజులు జైలుశిక్ష, రూ.2100జరిమానాను నాంపల్లి కోర్టు విధించింది. మొదటిసారి 10 కేసులు నమోదు కాగా, రెండోసారి నలుగురు, మూడోసారి పట్టుబడ్డ ఇద్దరికి కోర్టు జరిమానా విధించిందని ట్రాఫిక్ సీఐ తెలిపారు.